సాయంతో కలర్‌ఫుల్ నాట్యం రిహార్సల్స్ మొదలె ట్టారు.

స్కూలు ఆవరణా, స్టేజీ కూడా చాలదని ఫంక్షన్‌కి ప్రతిష్ఠాత్మకమైన 'కళాపీఠం' ఆడిటో రియం అద్దెకు తీసుకున్నారు.

రానే వచ్చింది ఆ వార్షికోత్సవ శుభదినం. స్టేజీ మీద కళ్లు చెదిరేలా ఎవరు మగపిల్లలో ఎవరాడపి ల్లలో తెలీకుండా కలిసిపోయి నాట్యప్రదర్శన సాగిం చారు.

కరతాళధ్వనులు మిన్నుముట్టాయి. కొంత మంది ఫోటోగ్రాఫర్లను పేరెంట్స్ ఏర్పాటు చేసుకు న్నారు. కొందరు వీడియోలు కూడా తీయించుకు న్నారు.

ఈ రికార్డింగుల తర్వాత ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్ రానే వచ్చింది. కార్పొరేటు దండు బాబుగారు లెక్చ రిచ్చాడు. ఎవరూ వినే మూడ్‌లో లేరు.

సోషల్ మిస్ మైక్‌లో అరిచింది. ''ఫస్ట్ ప్రైజ్ జాయింట్‌గా సంపత్, విద్యుల్లతలకి ఇచ్చాం. వాళ్లు వేదిక మీదికి రావాలి. ప్లీజ్ కమ్ టు ద డయాస్'' అంటూ.

ప్చ్...ప్చ్...ఎవ్వరూ రాలేదు. మళ్లీ అనౌన్స్ మెంటు చేసింది. పిల్లల్లో కలకలం తారాస్థాయికి చేరుకుంది,

''కమ్ కబ్ బాబీ...హలో బాబీగాల్..లెట్స్‌గో పార్టీ'' అంటూ కేకవేశారు మరికొందరు. ఆక తాయి స్టూడెంట్స్...

వేదిక మీద ఉన్న వారంతా, నల్లగా మొహాలు చేసుకున్నారు. సంపత్, విద్యుల్లతల తల్లిదండ్రుల గుండెల్లో రాయి పడ్డది.

పిల్లలేమయినట్లు? స్కూలు నిర్వాహకులు తెలివిగా పరిస్థితిని కమ్ముకొచ్చారు.

''యువర్ ఎటెన్షన్ ప్లీజ్! పిల్లలు ఛేంజి రూమ్‌లో మేకప్‌లు కడుక్కుంటున్నారు కాబోలు. ఈ లోగా సంపత్ మదర్‌గారూ, విద్యు ల్లత మదర్‌గారూ వచ్చి వారి పిల్లల ప్రతిభకి వచ్చిన ఈ బహుమతులను తమ అమృతహస్తాలతో అందుకుంటారు'' అంటూ ఎనౌన్స్ చేసింది సోషల్ మిస్. ఆమె చాలా తెలివైంది.

కానీ కరతాళ ధ్వనులు, హిప్ హిప్ హుర్రేలు ఆ ఇద్దరి పేరెంట్స్ చెవుల్లోనూ పడటం లేదు. వాళ్ల ప్రాణాలు కడబట్టుతున్నాయి.

''దే ఎస్కేప్డ్...ఎస్కేప్డ్ ఏమిటీ? 'ఎలోప్డ్' అనూ'' అంటున్నారెవరో. తలో వ్యాఖ్యానం చేస్తు న్నారు.

''అనుకున్నాం. కాస్ట్యూమ్ కిట్స్‌కి తాళాలు వేసి రెండో కంటికి దొరక్కుండా దాచేసుకున్నారు. అప్పుడే అనుకున్నాం'' అన్నారు కొందరు.

''అయినా మనకెందుకు? ప్రిన్సిపాల్‌గారి సి.ఐ.డి.లు మన మాటలు వింటే కొంప మునిగి తుంది'' ఈలోగా కరస్పాండెంట్ గప్‌చిప్‌న పేరెం ట్స్‌ని పక్కకి తీసుకుపోయాడు. ''లెటజ్ టాకిల్ దిస్ కేర్‌ఫుల్లీ. నా కారు తీసుకుని మా డ్రిల్లు మాస్టరు వస్తాడు. ఎక్కడికి పోతారు? ఫ్రెండ్స్ ఇళ్లకి పోయుంటారు'' అంటూ సర్దిచెప్పాడు.

''వెళ్లండి...వెతకండి'' డ్రిల్‌మాస్టారే ఈ షోకి రింగ్‌మాస్టర్ కనుక అతన్ని తిట్టసాగారంతా. అత నికో ఐడియా వచ్చింది. ''పదండి సార్ కార్లో'' అంటూ పేరెంట్స్‌ని ఎక్కించుకుని రైల్వే స్టేషన్‌కి దౌడు తీయించాడు.

''ఇప్పుడు హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ ఉందిగా... హైద్రాబాద్...చెక్కేద్దామనుకుంటారు వాళ్లు''

విద్యుల్లతకో టెలిఫోన్ ఫ్రెండున్నాడు. సినీ ఫీల్డులో...అక్కడికే పోవచ్చును. హైద్రాబాద్ ఎక్స్ ప్రెస్ పట్టుకొని గాలించేద్దాం... తరువాత... మిగతా ప్రయత్నాలు'' అన్నాడు.

పేరెంట్స్‌కి కరచరణాలు ఆడక, నోట మాట రావడం లేదు.

''వచ్చే ఏడాది వార్షికోత్సవం - కల్చరల్ షో అన్నారంటే ఉద్యోగాలు పీకేస్తాను ఏమనుకుంటు న్నారో...'' అంటూ చిందులు వేస్తున్నాడు ప్రిన్సి పాల్.

**-వీరాజీ** (విజయవాడ)

## అసలు విషయం

**వా**రం రోజులు సెలవులో ఉండి ఆ రోజే ఇంటికొచ్చాడు రాజేష్. ఊరు వెళ్లేటప్పుడు ఇంటి తాళాలు ఓనర్స్ ఇంట్లో ఇవ్వడం అలవాటు. వెళ్లి కీస్ తీసుకుని రూం ఓపెన్ చేసి చూసి తెల్లబో యాడు. చివ్వున వెనుతిరిగి ఇంటి ఓనర్ మురళి దగ్గరకెళ్లాడు.

''ఏంటండీ ఇది? మీరు చేసిన పని ఏమన్నా బాగుందా?'' దూకుడుగా అడిగాడు.

''అదేంటయ్యా.. నేనేం చేశాను?'' నివ్వెరపో యాడు మురళి.

''ఏంచేశారా? నేను లేని టైంలో రూంకి సున్నం వేయిస్తారా? నాకు చెప్పాల్సిన అవసరం లేదా?''

''అదేమిటయ్యా అందరూ సున్నాలేయమని అడుగుతారు. నీవేమో వేయించినందుకు సంజా యిషీ అడుగుతున్నావు?'' అయోమయంగా అడి గాడు ఇంటి ఓనర్ మురళి.

''సామానంతా...''

''నేనూ...మా ఆవిడ దగ్గరుండి వేయించాం. ఒక్క పూచిక పుల్ల కూడా పోలేదు. కావలిస్తే చూసుకో'' మధ్యలోనే చెప్పాడు.

''అది కాదండీ..నా ఇంపార్టెంట్ టెలిఫోన్ నెంబర్స్ అన్నీ పాడుచేసేశారు'' ఉక్రోషంగా అన్నాడు రాజేష్.

''అయ్యో... లేదు బాబూ.. చెత్త పేపర్ కూడా దులిపి ఓ కవర్‌లో వేయించాను. టెలిఫోన్ డైరెక్టరీ అస్సలు ముట్టుకోలేదు'' బాధగా చెప్పాడు మురళి.

''అదికాదండీ...నే ఫోను పక్కనే గోడకు ఇంపార్టెంట్ టెలిఫోన్ నెంబర్స్ అన్నీ రాసుకు న్నాను. మీరేమో నాకు చెప్పకుండా సున్నం వేసే శారు. ఇప్పుడేం చేయాలి?... నాకా నెంబర్స్ ఎలా దొరుకుతాయి?'' అసలు విషయం చెప్పాడు రాజేష్.



తెల్లబోవడం మురళి వంతైంది.

**-ఊర్మిళా సుభాన్** (మర్ల)